# ఒథెల్లో సిండ్రోమ్

## సైకియాట్రిక్ కథలు



నిద్రమాత్రలు ఎక్కువగా మింగిన ఒకామెను హాస్పిటల్లో చేర్చారు. ఆమెను ప్రమాదం నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

హాస్పిటల్లోని సైకియాట్రిస్టుతో ఆమె భర్త మాట్లాడాడు. ''ఇంతటి అఘాయిత్యానికి ఎందుకు పూనుకుందో తెలియడం లేదు. ఆమెను కంటికి రెప్పలా చూసుకునేవాడిని. ఏనాడూ ఆమెను తిట్టలేదు, కొట్ట లేదు, బాధించలేదు.''

ఆమె అత్తమామలు కూడా అదే వంత పాడేరు. ''కోడల్ని కూతురిలాగే చూసుకోవాలని మా నమ్మకం. అబ్బాయికి మా ఊరికి ట్రాన్స్‌ఫర్ కావాలనీ, తొందరగా మనవలు పుట్టాలనీ, మనవలతో ఆడుకుంటూ గడపాలనీ మా ఆశ. అమ్మాయి ఎందుకిలా చేసిందో''

ఆశ్చర్యకరమైన విషయం ఆమె తల్లిదండ్రులు కూడా అల్లుణ్ణి పొగుడుతూ మాట్లాడడం. ఆమెకు స్పృహవచ్చి కోలుకున్న తర్వాత భర్త ఆమెను సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకుని వచ్చాడు.

''మీపేరేమిటమ్మా'' డాక్టరు ప్రశ్నించాడు.

''నీరజ'' ఆమె నెమ్మదిగా బదులిచ్చింది.

డాక్టరు నీరజ భర్తతో ''మీరు కొంచెంసేపు బయట కూచోండి. అప్పుడు ఆవిడ ఫ్రీగా మాట్లాడగలుగుతారేమో'' అన్నాడు.

నీరజ భర్త అయిష్టంగా మొహం పెట్టి, తప్పనిసరి అన్నట్లుగా బయటకు వెళ్ళాడు. నీరజ తన కథను నెమ్మదిగా చెప్పడం ప్రారంభించింది.

నీరజను చూసుకుందుకు రామ్మోహన్, అతని తల్లిదండ్రులూ వచ్చారు. పెళ్ళి నిశ్చయమైంది. నిశ్చయమైన రోజున రామ్మోహన్ నీరజ తల్లిదండ్రులతో ''మేమిద్దరం ఒకసారి బయటకు వెళ్ళివస్తామండీ'' అన్నాడు. వివాహం నిశ్చయమైన నాటినుంచీ అమ్మాయి, అబ్బాయి కలిసి తిరగడం ఈరోజుల్లో సామాన్యమే. నీరజ తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

కాబోయే భర్త సినిమాకో, షికారుకో, షాపింగుకో తీసికెడతాడనుకుంటూ కోటి కోరికలతో నీరజ బయల్దేరింది. రామ్మోహన్ స్కూటర్ ఒక క్లినిక్ ముందు ఆగగానే ఆమె ఆశ్చర్యపోయింది. బహుశ, డాక్టరు ఈయన ఫ్రెండ్ అయి ఉండవచ్చును, పరిచయం చెయ్యడానికి తీసుకువచ్చారేమో అనుకుంది.

క్లినిక్ ఒక గైనకాలజిస్టుది. డాక్టరు రామ్మోహన్‌ని చూస్తూనే గుర్తుపట్టినట్లుగా నవ్వి నీరజతో ''లోపలకు రామ్మా'' అంది. నీరజ భయపడుతూ లోపలకు వెళ్ళింది. డాక్టరు టెస్టు చేస్తుంటే ఆమె భయంతో, సిగ్గుతో ముడుచుకుపోయింది. టెస్టు పూర్తయ్యాక నీరజ లేచి డ్రస్సు చేసుకునే లోగానే డాక్టరు బయటకువెళ్ళి ''హైమన్ ఇన్‌టాక్ట్‌గా ఉంది'' అని చెప్పడం నీరజకు వినిపించింది.

అథఃపాతాళం లోకి పడిపోతున్నట్లనిపించింది నీరజకు.

భర్త ఆమెకు కన్యాత్వ పరీక్ష చేయించడంతో నీరజ కష్టాలు ఆగిపోలేదు.

అతని అనుమానం పెనుభూతమై ఆమెను మింగివేసింది. వివాహమైన కొత్తలో ఆమె మామూలుగానే మగవారితో మాట్లాడింది. అతను ఆమె వాళ్ళలో అఫైర్ పెట్టుకున్నట్టుగా మాట్లాడాడు. తండ్రితో, అన్నతో కూడా అత్యవసరమైతే తప్ప మాట్లాడడం మానేసింది.

బంధుమిత్రులలోని మగవారితో మాట్లాడడం మానేసినా నీరజకు పాలవాడితో, పూలవాడితో మాట్లాడడం తప్పేదికాదు. కొన్నాళ్ళకి రామ్మోహన్ వారితోకూడా మాట్లాడవద్దనీ, తనే ఇంటి వ్యవహారాలు చూసుకుంటాననీ చెప్పాడు. నీరజకు అవుననక తప్పలేదు.

తనది ఎవరికీ చెప్పుకోలేని కష్టం అనుకుంది నీరజ. భర్త అత్తమామలనూ, తల్లితండ్రులనూ ఒకేలా అభిమానంగా చూస్తాడు. తన అన్నయ్యతో స్నేహితుడిలా ఉంటారు. అంత మంచితనం చూపించే వ్యక్తి గురించి తనేం చెప్పినా ఎవరూ నమ్మరు. నీరజ భర్త చెప్పినట్లే నడుచుకో సాగింది.

నీరజలో భర్తకి లొంగి ఉండే గుణం పెరిగినకొద్దీ రామ్మోహన్‌లో అనుమానం పెరిగిపోసాగింది. ఆమెకు చాలామంది ప్రియులున్నారని నిందించసాగాడు. అతని నిందలకు అర్థం పర్థం లేకుండా పోయింది. చివరకు టెలిఫోన్‌లో రాంగ్‌నంబర్ వస్తే ''ఎవడో నీ ప్రియుడు చేసినట్లున్నాడు. నా గొంతు వినగానే పెట్టేసినట్లున్నాడు'' అనేవాడు. ఇంటిముందు ఏదైనా స్కూటర్ స్లోగా వెడితే ''నీ లవర్ నీకోసం స్లో చేసినట్లుంది పాపం'' అనేవాడు.

చివరకు ''రాత్రి నేను నిద్రపోయాక నువ్వు బయటకు వెళ్ళి నీ ప్రియుళ్ళందరితో కులికి వస్తున్నావు'' అని నిందించాడు. ఓర్చుకోలేని నీరజ నిద్రమాత్రలు మింగింది...

''అదీ డాక్టర్ నా కథ. ఆయన అన్నివిధాలా మంచివారే. ఏ దురలవాట్లూ లేవు. నాకు తిండికీ, బట్టకూ, సౌకర్యాలకు లోటులేదు. కానీ ఈ అనుమానపు జబ్బు నన్ను కాల్చేస్తోంది. చావు తప్ప గత్యంతరం లేదనిపించింది.''

''మాత్రలు మింగాక మీకేమనిపించింది?'' డాక్టరు అడిగాడు.

''బతకాలనిపించింది. నేను మాత్రలు మింగినందుకైనా ఆయన మారతారేమోననిపించింది. నేను బతికి, ఆయనతో హాయిగా ఉండాలనిపించింది.''

''మాత్రలు మింగాల్సింది మీరుకారు. ఆయనకు మందులివ్వాలి''

నీరజ హడావుడిగా మంగళసూత్రం కళ్ళకద్దుకుంది. డాక్టరు పెదవులపై సన్నని చిరునవ్వు కదిలి మాయమైంది.

''నేను ఆయనకు నిద్ర మాత్రలివ్వాలని చెప్పడం లేదు. అనుమానం కూడా ఒక జబ్బే. ఎప్పుడో ఒకసారి ఆయనకు అనుమానం రావడం లేదు. ఎప్పుడూ అనుమానంతో బాధపడుతున్నారు. ఇతరత్రా అన్ని విషయాలలోనూ బాగుంటున్నారు కదా. ఈ పరిస్థితిని మా సైకియాట్రిక్ వైద్య పరిభాషలో డెల్యూషనల్ డిసార్డర్, జెలస్ టైప్ అంటాం. మందులతో ఈ స్థితిని తగ్గించవచ్చు. మీవారితో కూడా మాట్లాడతాను. మీకు షేక్స్‌పియర్ నాటకాలతో పరిచయముందా?''

''డిగ్రీలో ఇంగ్లీషు లిటరేచర్ మేజర్‌గా చదివాను.''

''అయితే మీకు ఒథెల్లో డ్రామా తెలిసే ఉంటుంది. అనుమానానికి మారుపేరు ఒథెల్లో. అందుకే నిష్కారణంగా పెరిగే అనుమానమున్న స్థితిని ఒథెల్లో సిండ్రోమ్ అంటారు. ఎందరో ఒథెల్లో సిండ్రోమ్‌తో బాధపడుతూ, తమ భార్యలనీ, భర్తలనీ బాధపెడుతూ ఉంటారు. మనదేశంలో స్త్రీలు వివాహమైన యాభై ఏళ్ళకి కూడా అనుమానపు భర్తలు ఎంత బాధిస్తున్నా సహిస్తూనే ఉంటారు. అనుమానానికి కూడా వైద్యముందని చాలామందికి తెలియదు''

> ''అదీ డాక్టర్ నా కథ. ఆయన అన్నివిధాలా మంచివారే. ఏ దురలవాట్లూ లేవు. నాకు తిండికీ, బట్టకూ, సౌకర్యాలకు లోటులేదు. కానీ ఈ అనుమానపు జబ్బు నన్ను కాల్చేస్తోంది. చావు తప్ప గత్యంతరం లేదనిపించింది.''

భార్య ఆత్మహత్యా ప్రయత్నం చేసిందన్న భయం వల్లనే, అనుమానం తనను కూడా కాల్చేస్తోందన్న భావం వల్లనే రామ్మోహన్ వైద్యం చేయించుకుందుకు ఒప్పుకున్నాడు. అతనికి మందులిచ్చారు. అతను మందు వాడినంత కాలం భార్యపై ఏ అనుమానమూ రాలేదు. మధ్యలో ఒకటి రెండుసార్లు మందు మానేస్తే అతణ్ణి అనుమాన పిశాచం మళ్ళీ ఆవేశించింది. అందువల్ల అతను మందు ఎప్పుడూ మానలేదు. ట్రీట్‌మెంట్ జరిగిన కొంతకాలానికి నీరజా, రామ్మోహన్ హాయిగా ఉన్నారు.

అనుమానానికి కూడా మందులుంటాయన్న విషయం ఆశ్చర్యంగా ఉంది కదూ. రామ్మోహన్ వంటి వ్యక్తులు స్త్రీలలో, పురుషులలో ఎందరో ఉంటారు. వారికీ, వారివల్ల కష్టపడేవారికీ అనుమానానికి ట్రీట్‌మెంట్ ఉందన్న విషయం ఆశాజనకంగా ఉందని ఆశిస్తాను.

**-పాలంకి సత్య ★**